


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 50 తిరుపతి తేది :గురువారం 21 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## ఇటలీ పర్యటనలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 20



పలు రోజుల నుంచి విదేశీ పర్యటనలతో పీఎం మోడీ చక్కర్లు కొడుతున్నారు. తాజాగా ఇటలీలోని రోమ్‌లో ప్రధానమంత్రి అడుగుపెట్టగా , ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఆయనకు స్వాగతం పలికారు. భారత్– ఇటలీ సంబంధాల బలోపేతమే లక్ష్యంగా ఇరువురి నేతల మధ్య చర్చలు జరగనున్నాయి. పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ తనకు ‘మెలోడీ’ టాఫీల (చాక్లెట్ల) ప్యాకెట్‌ను బహుమతిగా ఇస్తున్న వీడియోను మెలోని స్వయంగా షేర్ చేశారు. ఆ వీడియోకు “బహుమతికి ధన్యవాదాలు” అని ఆమె క్యాప్షన్ పెట్టారు. అదే విధంగా ప్రధానమంత్రి మోడీ బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాతో ప్రతినిధి బృంద స్థాయి చర్చలు జరిపారు. ఈ ద్వైపాక్షిక సమావేశంలో పీఎం మోడీ వెంట విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి (పశ్చిమ) సిబి జార్జ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి, ఇతర సీనియర్ దౌత్య అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు

# ఏపీలో పనిచేయాలి

- ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబునాయుడు
- హింసలేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని బోధిస్తున్నారన్న సీఎం
- గ్రామాల నుంచి కొలంబియా వరకు అనిశ్చితి నెలకొంటే చర్చల ద్వారా మార్పులు తెచ్చినట్లు వెల్లడి



అమరావతి – ఆంధ్రనాడు, మే 20

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షి కోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. కేవలం ఓ ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని, ఓ భారతీయుడిగా, గురూజీ బోధనల్ని అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని, శాంతిసామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని కొనియాడారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తు న్నారుని

- మిగతా 2లో..

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో

# నమ్మకం కలిగించండి

- బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కర్నూలు, ఏఎస్ఆర్ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెడతాం
- డీఈవోలు, ఏపీసీలతో సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్



అమరావతి – ఆంధ్రనాడు, మే 20

ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా అధికారులు కృషిచేయాలి, ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో డీఈవోలు, ఏపీసీలతో మంత్రి సమీక్షించారు. కాకినాడ జిల్లాలో అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లో స్టూడెంట్, టీచర్ యావరేజ్ అటెండెన్స్ తక్కువగా ఉంది. దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. బేసిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, మధ్యాహ్న భోజనం వినియోగంలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. అపార్ ఐడీ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచారని మంత్రి ప్రశంసించారు. కాకినాడ డీఈవో పి.రమేష్ స్పందిస్తూ, జిల్లాలో

- మిగతా 2లో..

## మత్స్యకార, అన్నదాతల

# సంక్షేమమే ముఖ్యం

- మత్స్యకారుల వలసలను నివారిస్తామన్న పవన్ కల్యాణ్
- స్థానికంగానే మెరుగైన ఉపాధి, ఆర్థిక అవకాశాలను కల్పిస్తామని వెల్లడి
- ప్రతి మత్స్యకార కుటుంబానికి వారి బ్యాంకు ఖాతాల్లోకి రూ. 20 వేలు జమ చేస్తున్నామన్న డిప్యూటీ సీఎం

అమరావతి – ఆంధ్రనాడు, మే 20



ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీరప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకార కుటుంబాల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మత్స్యకారుల వలసలను నివారించడంతో పాటు, వారికి స్థానికంగానే మెరుగైన ఉపాధి, ఆర్థిక అవకాశాలను కల్పించడమే తమ ప్రభుత్వం ముందున్న ప్రధాన లక్ష్యమని

- మిగతా 2లో..



## ఇక బయోమెట్రిక్

# అక్కర్లేదు..

- రేషన్ పంపిణీపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన
- ఏపీలో రేషన్ పంపిణీకి డిజిటల్ కరెన్సీ విధానం అమలు
- విజయవాడ, విశాఖపట్నంలలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం

న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 20

ఏపీలో రేషన్ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు ఉన్న విధానానికి భిన్నంగా, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌లోని నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ విధానాన్ని,

# ప్రవాసాంధ్రులకు అద్భుత సేవలు

- తెలంగాణ ఎన్నారై సలహా కమిటీతో మంత్రి కొండపల్లి

అమరావతి – ఆంధ్రనాడు, మే 20



ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎపిఎన్ఆర్‌టిఎస్ సంస్థ ద్వారా అనేక విజయవంతమైన కార్యక్రమాలు చేపడుతోందని ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి ఎన్నారై సలహా కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో తాడేపల్లిలోని ఎపిఎన్ఆర్‌టి భవనంలో బుధవారం సమావేశమయ్యారు. ప్రవాసాంధ్రుల కోసం ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ కార్యక్రమాలను మంత్రి కొండపల్లి.. కమిటీ సభ్యులకు వివరించారు. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, మోసపూరిత ఏజెంట్లపై తీసుకుంటున్న చట్టపరమైన చర్యల గురించి మంత్రితో పాటు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ వలసదారుల భద్రత, బీమా సౌకర్యాలు, పునరావాస పథకాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎపిఎన్ఆర్‌టి ప్రెసిడెంట్ డాక్టర్ వేమూరి రవి, సిఇఒ కృష్ణమోహన్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, నిజామాబాద్ రూరల్

- మిగతా 2లో..

## ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై

# తనిఖీలు చేపట్టండి

- ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై అచ్చెన్నాయుడు ఆగ్రహం
- అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
- అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ జరపాలన్న మంత్రి

అమరావతి – ఆంధ్రనాడు, మే 20



ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టిస్తూ, ఇతర వ్యవసాయేతర పనులకు తరలించడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్రమ నిల్వలపై నిఘా పెట్టేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫెర్టిలైజర్ డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల పంపిణీలో

- మిగతా 2లో..

## మత్స్యకార, అన్నదాతల సంక్షేమమే ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)
ఆయన ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, సంక్షోభాల కంటే కూడా అన్నదాతలు, మత్స్యకారుల సంక్షేమమే తమకు అత్యంత ప్రాధాన్యమని, గతంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని ఈ సందర్భంగా ఆయన మరోసారి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే, మత్స్యకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుతూ వరుసగా రెండో ఏడాది కూడా 'మత్స్యకార సేవలో' పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విజయవంతంగా విడుదల చేసింది. ఈ పథకం కింద అర్హత సాధించిన ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అత్యంత పారదర్శకంగా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా భవిష్యత్తులో వలసలను పూర్తిగా అరికట్టేలా మరిన్ని పటిష్ఠమైన చర్యలు తీసుకోబోతున్నట్లు వెల్లడించారు.

## ఇక బయోమెట్రిక్ అక్కర్లేదు..

(మొదటిపేజీ తరువాయి)
త్వరలోనే రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలలో కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సీబీడీసీ విధానం ప్రకారం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ వ్యాలెట్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ డబ్బును డిజిటల్ రూపాయి రూపంలో నేరుగా లబ్ధిదారుల వ్యాలెట్‌కు జమ చేస్తుంది. లబ్ధిదారులు ఆ డిజిటల్ డబ్బుతో రేషన్ దుకాణాల్లో తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేయవచ్చు. ఈ విధానంలో బయోమెట్రిక్ అవసరం కూడా ఉండదు. దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ ఎంత వస్తుందో లబ్ధిదారులకు, తమ మార్జిన్ ఎంత వస్తుందో డీలర్లకు స్పష్టత ఉంటుందని మంత్రి వివరించారు. రేషన్ పంపిణీతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద ఇకపై సన్న బియ్యానికి బదులుగా నాణ్యమైన స్టీమ్డ్ రైస్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారన్నారు. అలాగే, రాష్ట్రం నుంచి 2 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఇవేకాకుండా, వినియోగదారులకు తక్కువ ధరలకే నిత్యావసరాలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మినీమార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఏపీకి గర్వకారణమైన అరకు కాఫీని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మిలటరీ క్యాంటీన్లలో విక్రయించేందుకు ఎన్‌సీసీఎఫ్ (నేషనల్ సెంట్రల్ కోఆపరేటివ్ ఫెడరేషన్) అంగీకరించిందని మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రవాసాంధ్రులకు అద్భుత సేవలు

(మొదటిపేజీ తరువాయి)
ఎమ్మెల్యే రేకుల భూపతి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

**కొత్త స్టార్టప్‌లకు ప్రోత్సహకాలు**

రాష్ట్రంలో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎఐసి–ఎస్‌కెయు) సిఇఒ సి చంద్రమౌళి, పి జ్యోతి మంత్రిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎఐసి–ఎస్‌కెయు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రధాని మోడీ ప్రశంసలు అందుకున్న, ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తి ఎలక్ట్రిక్ హబ్‌లెస్ సైకిల్‌ను అభివృద్ధి చేసిన హెలెన్ బైక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆవిష్కరణను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు అందుకున్న అవన్ టెక్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన నీటి పొదుపు సాంకేతికతను ప్రదర్శించారు.

## ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి

(మొదటిపేజీ తరువాయి)
వ్యవసాయ శాఖ అధికారుల వైపు నుంచి ఏమైనా నిర్లక్ష్యం ఉందా అనే కోణంలోనూ తక్షణమే విచారణ జరపాలని ఆయన సూచించారు. రైతులకు సాగు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఇకపై ప్రతిరోజూ జిల్లాల వారీగా ఎరువుల నిల్వలపై (స్టాక్) ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్నదాతలను మోసం చేసే ఏ ఒక్క చర్యను ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఏ డీలరైనా ఎరువులను బ్లాక్‌కు తరలించినా లేదా పక్కదారి పట్టించినా వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆజ్ఞాపించారు.

## కుల గణన చేయొచ్చు

**- వారెవరో ఏ ప్రభుత్వమైనా తెలుసుకోవాల్సిందే**

**- పిటిషన్ కొట్టేస్తూ సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 20**

దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించే ప్రక్రియలో భాగంగా కులాన్ని నిర్ధారించడంలో ఏ ప్రభుత్వ తప్పిదమైనా ఏమీ వుండదని సుప్రీం కోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. "ఎంతమంది వెనుకబడి వున్నారు, ఎంతమందికి సంక్షేమ చర్యలు అవసరం అనేది ప్రభుత్వం తప్పనిసరిగా తెలుసుకోవాల్సి వుంటుంది. ఇది విధానపరమైన అంశం." అని త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ పేర్కొన్నారు. కుల గణనను 2027 జనగణన ప్రక్రియలో భాగం చేయరాదంటూ పిటిషనర్ సుధాకర్ గుమ్ముల దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. "రాజకీయ నేతలు, కార్పొరేట్ సంస్థలు కుల డేటాను దుర్వినియోగం చేయడానికి అపారమైన అవకాశాలు వున్నాయి. అటువంట ప్పుడు పెద్ద మొత్తంలో కులాల డేటాను సమీకరిం చడంలో అర్థం లేదు." అని గుమ్ముల వాదించారు. 2027 జనగణనలో కుల గణన తప్పనిసరిగా వుండాలా లేదా అనే అంశంపై నిర్ణయం కోర్టు పరిధిలో లేదని చీఫ్ జస్టిస్ చెప్పారు. ఈ అంశం తప్పనిసరిగా విధానపరమైన పరిధిలోకి వస్తుందని అంటూ కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 2027 జనగణనలో కుల గణనను చేర్చాలని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలో రాజకీయ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ నిర్ణయించింది. 2027 జనాభా లెక్కల రెండవ దశలో కుల గణనను పొందుపరచనున్నట్లు పార్లమెంట్‌లో ప్రభుత్వం తెలియజేసింది.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)
అన్నారు. హింసలేని సమాజం–ఒత్తిడి లేని మను షులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని కితాబిచ్చారు.

యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయటపడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని కొనియాడారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్ ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ, అనిశ్చితి నెలకొన్న కొలంబియా ప్రాంతాల వరకూ చర్చలు అనే శాంతి మార్గం ద్వారా మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మికవేత్త శ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు. 45 ఏళ్లక్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ బెటర్ వరల్డ్ అనే విజన్ తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజునవేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య లాంటి రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ను ఆయన అభినందించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రోజువారీ జీవితంలో చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయని వెల్లడించారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయని, సామాన్య ప్రజల జీవితాలు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోందని అన్నారు. గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కొని సమర్థంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాని మోదీ లాంటి సమర్ధవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని జోస్యం చెప్పారు. వేల ఏళ్ల క్రితం వరకూ మానవాళిని నడిపించిన నేల



ఇది. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన దేశం మనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనంలో శాంతిని సాధించేలా శ్రీ రవిశంకర్ గురూజీ తన బోధనలతో ప్రభావితం చేశారని, సంస్కృతితో మిళితమైన ఆధునికత, విలువలతో కూడిన జీవనం లాంటి ఎన్నో అంశాల ద్వారా తన బోధనల్ని సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మేం కూడా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి అధ్యాత్మిక క్షేత్రాలు నిండిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేననేది తన భావన అన్నారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యం కూడా అన్నారు. ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకు న్నామని చంద్రబాబు నాయుడు అన్నారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దు తున్నామని అన్నారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడిలేని సమాజాన్ని కూడా తీసుకురావాలని పేర్కొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని పేర్కొన్నారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని కోరారు.

**గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులు పొందిన ఎంపీ సానా సతీష్ బాబు**

బెంగళూరులో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పొందారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం గురుదేవ్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, గురుదేవ్ ఆశీస్సులు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత మనిషిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజసేవలో మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి

(మొదటిపేజీ తరువాయి)
3,665 మంది డ్రాపౌట్స్ ఉన్నారని, ఎన్ రోల్ కానివారు 14,840 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు అసలు ఎన్‌రోల్ కానివారిపై దృష్టిసారించామని చెప్పారు. పలు మండలాల్లో సూడెంట్స్ అటెండెన్స్ తక్కువగా ఉండ టంపై తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు వివరిం చారు. పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది 80.47శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 500కు పైగా మార్కులు సాధించిన వారు 2,789 మంది ఉన్నారని తెలిపారు.

**ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాలి**

ప్రకాశం జిల్లాలో విద్యార్థుల డ్రాపౌట్స్ పై మంత్రి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వలస వెళ్లే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాఠశాలకు సెలవుల అనంతరం విద్యార్థులు ఏ ప్రాంతానికి వెళ్లినా వారి చదువు కొనసాగేలా ట్రాక్ చేయాలని ఆదేశించారు. సీజనల్ హాస్టల్స్ ను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో స్టూడెంట్, టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, లీప్ యాప్ లో టీచర్ అటెండెన్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. స్టూడెంట్, టీచర్ రేషియోపైనా దృష్టిసారించాలన్నారు. ప్రకాశం జిల్లా డీఈవో సీవీ రేణుక స్పందిస్తూ.. ఈ ఏడాది జిల్లాలో పది శాతం ఎన్ రోల్ మెంట్ పెరిగిందని చెప్పారు. పాఠశాలలకు సెలవుల అనంతరం వ్యవసాయ పనుల్లో పడి విద్యార్థుల హాజరు నమోదు తక్కువగా ఉంటోందని వివరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారని, పదో తరగతి టాపర్లను సన్మానించారని తెలిపారు. వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని చెప్పారు.

**బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

చిత్తూరు జిల్లాలో బాల్య వివాహాల పట్ల మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో జీఎఫ్ఎల్ఎన్ పై దృష్టి సారించాలని ఆదేశిం చారు. స్టూడెంట్స్ ఫెర్ఫార్మెన్స్ కూడా తక్కువగా ఉందని, ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్ లో కూడా చిత్తూరు వెనుకబడి ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. చిత్తూరు డీఈవో కే.రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. చిత్తూ రుకు తమిళనాడు, బెంగళూరు దగ్గరగా ఉండటంతో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పలుచోట్ల బాల్య వివాహాలు కూడా జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృష్టికేంద్రీకరిస్తామని చెప్పారు.

**ఏఎస్ఆర్ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటాం**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఆ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. హైస్కూల్స్ లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థుల చేరిక తక్కువగా ఉందని, దీనిపైనా దృష్టిపెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలపై స్పందిస్తూ, అక్కడి విద్యార్థుల్లో కసి ఉందని, వారికి దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. డీఈవో కే.రామకృష్ణారావు స్పందిస్తూ.. జిల్లాలో 3,242 మంది డ్రాపౌట్స్ ఉన్నారు. స్టూడెంట్స్ యావరేజ్ అటెండెన్స్ 79.30 శాతం ఉందని, టీచర్ల సరాసరి హాజరు 78.40 శాతంగా ఉందని వివరించారు.

**స్లిప్ టెస్ట్ అటెండెన్స్ పై దృష్టిపెట్టాలి**

ఏలూరు జిల్లాలో స్లిప్ టెస్ట్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. టీచర్ అటెండెన్స్ పైనా దృష్టిసారించాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని మంత్రి ఆరా తీశారు. కొన్ని మండలాల్లో ఉత్తీర్ణతా శాతంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ స్పందిస్తూ.. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. టీ టైమ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు.

**విద్యార్థుల హాజరుపై దృష్టి కేంద్రీకరించాలి**

పల్నాడు జిల్లాలో విద్యార్థుల హాజరుపై దృష్టికేంద్రీ కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. టీచర్ అటెండెన్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్ పైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో స్కూల్ అకడమిక్ స్టార్ రేటింగ్ లో హైస్కూల్స్ ఎక్కువగా 3స్టార్ రేటింగ్ లో ఉండటం పట్ల మంత్రి అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా కృషిచేయాలన్నారు. పల్నాడు డీఈవో పీవీజే రామారావు స్పందిస్తూ.. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, విద్యార్థుల డ్రాపౌట్స్ పై దృష్టిసారించినట్లు చెప్పారు.

**కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టిసారిస్తాం**

కర్నూలు జిల్లా ఫలితాల పట్ల మంత్రి లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో భయానక పరిస్థితులు చూశానని, కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్స్ పై ఎక్కువ దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, టీచర్, స్టూడెంట్స్ అటెండెన్స్‌లో జిల్లా వెనుకబడి ఉందని చెప్పారు.

**మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుంది**

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుందని, ఇందుకు గల కారణాలను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. జిల్లాలో జీఎఫ్ఎల్ఎన్ ఇంప్రూవ్ మెంట్ కు ఇంకా అవకాశం ఉందని, దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. ముస్తాబు కార్యక్రమాన్ని ప్రశంసించారు. డీఈవో పి. బ్రహ్మజీ రావు స్పందిస్తూ.. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. త్వరలో 6వేల మంది విద్యార్థులతో కోలాటం కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టిపెట్టండి**

పశ్చిమ గోదావరి జిల్లాలో అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టికేంద్రీకరించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టూడెంట్–టీచర్ రేషియో బాగుందని ప్రశంసించారు.

డీఈవో నారాయణ స్పందిస్తూ.. ప్రైమరీ స్కూల్స్ లో టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారిస్తామని చెప్పారు. డోర్ టూ డోర్ ప్రచారంలో లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృషిపెడతామని తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన ఎస్జీటీ వాణి, అనంతపురం జిల్లా డీఈవో మోహన్ కృషిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 20 :** వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందిన వారు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. మండల పరిధిలోని రజక, స్వర్ణకార, నాయీ బ్రాహ్మణ, అత్యంత వెనుకబడిన వర్గాల (ఎంబీసీ) లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకంపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన లబ్ధిదారులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకం వివరాలు మరియు అర్హతలు:రజక / చాకలి వర్గాలు: నెలకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (లాండ్రి షాపు కలిగి ఉండవలెను). స్వర్ణకార / విశ్వబ్రాహ్మణ వర్గాలు: నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (స్వర్ణకార షాపు కలిగి ఉండవలెను). నాయీ బ్రాహ్మణ వర్గాలు: నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (హెయిర్ కటింగ్ సెలూన్ షాపు కలిగి ఉండవలెను). ఎం.బి.సి వర్గాలు: పేదరిక రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఉంటుందన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందదలచిన వారు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, కుల ధృవీకరణ పత్రం, ప్రస్తుత విద్యుత్ బిల్లు లేదా సర్వీస్ నంబర్, లేబర్ డిపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఈ సర్టిఫికేట్ లేని వారు స్థానిక సచివాలయం ద్వారా పొందవచ్చని, ఎం.బి.సి. వర్గాలకు ఈ సర్టిఫికేట్ అవసరం లేదని తెలిపారు. మండలంలోని అర్హులైన లబ్ధిదారులందరూ వెంటనే తమ సచివాలయ సిబ్బందిని లేదా విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించి, దరఖాస్తు చేసుకొని ఈ ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ బడులపై పెరిగిన ఆదరణ.. ప్రవేశాల కోసం తల్లిదండ్రుల ఆసక్తి...



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 20:** ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ పెరుగుతున్నట్లు కేవీబీపురం మండలంలో నిర్వహించిన ప్రత్యేక ప్రవేశ అవగాహన కార్యక్రమం స్పష్టం చేసింది.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూనాటి సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం బుధవారం రాయపేడు, ఒళ్లూరు, వగత్తూరు, మహాదేవపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులను నేరుగా కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు, ఆధునిక బోధన విధానాలు, విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కూనాటి సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వేదికలుగా మారుతున్నాయి అన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఉపాధ్యాయ బృందం సమిష్టిగా కృషి చేస్తోంది అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, ధర్మరాజుల రెడ్డి, భువన్, కృష్ణ, ప్రకాష్, సీఆర్పీలు సూపర్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 20 :** పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో బాలాజీ అన్నారు. ప్రతి బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్వచ్ఛ పథం కార్యక్రమము నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మండలంలో అన్ని పంచాయతీలు ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ ప్రధాన వీధులలో, మండల ప్రధాన వీధులలో పంచాయతీ అభివృద్ధి అధికారులు చేపట్టారు. మండలంలోని ముత్తుకూరు గ్రామపంచాయతీలోని ప్రధాన వీధి నందు పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామస్తులకు ప్రభుత్వంచే నిర్వహించబడు ఐవిఆర్ఎస్ కాల్స్ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శారదాదేవి, పంచాయతీ అభివృద్ధి అధికారి సుజాత, శానిటేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పనికిరాని వస్తువులకు బదులుగా నిత్యావసర సరుకులు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 20 :** ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛరదం కార్యక్రమము గ్రామాలలో గ్రామస్తుల వద్ద నుండి పొడి చెత్త అయిన ప్లాస్టిక్, అల్యూమినియం, ఇనుము, పాత పేపర్లు, పుస్తకములు మొదలైనవి తీసుకొని వాటికి బదులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కరసనపల్లి గ్రామపంచాయతీలో స్వచ్ఛరథం వాహనం ద్వారా ప్రజల నుండి పనికిరాని పాత సామాగ్రి తీసుకొని ప్రత్యామ్నాయంగా వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీఓ శారదాదేవి పంచాయతీ కార్యదర్శి, స్వచ్ఛరథం ఆపరేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

# రేణిగుంటలో ఎస్పీ తనిఖీలు



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 20 :** రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసులపై సమగ్ర పరిశీలన, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, నేర నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు భద్రతాభావం కలిగేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు.మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యల విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా తక్షణ స్పందనతో బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి చట్టపరమైన చర్యలు వేగవంతంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ పరికరాల రాయితీకి గడువు పెంపు

**- పథకానికి మరో ఐదు రోజుల గడువు**

**తిరుపతి కలెక్టరేట్ –ఆంధ్రనాడు, మే 20:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించేందుకు చర్యలు చేపట్టింది. ట్రాక్టర్లు, గొర్రులు, కోత–నూర్పిడి యంత్రాలు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు తదితర వ్యవసాయ యంత్ర పరికరాలను ఈ పథకం ద్వారా అందించనుంది. ఖరీఫ్, రబీ సాగు అవసరాల దృష్ట్యా 2025–26 సంవత్సరానికి తిరుపతి జిల్లాకు రూ.3.14 కోట్లు కేటాయించింది. మొదట రైతులు మే 5 నుండి మే 19 వరకు దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం గడువు నిర్ణయించింది. అయితే రైతుల సౌలభ్యం దృష్ట్యా ఈ గడువును మరో ఐదు రోజులు పొడిగిస్తూ మే 26 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. వ్యవసాయ శాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మే 27–29 మధ్య లక్ష్యాల పరస్పర మార్పిడి ప్రక్రియ జరుగుతుంది. మే 30 నుండి జూన్ 3 వరకు లబ్ధిదారుల ఎంపిక, లాటరీ ప్రక్రియ, జాయింట్ కలెక్టర్ ద్వారా మంజూరు పత్రాల జారీ చేపడతారు. ఎంపికైన రైతులు జూన్ 4 నుండి 18 వరకు నాన్–సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాలి. జూన్ 4 నుండి జూలై 3 వరకు యంత్రాల సరఫరా కొనసాగుతుంది. జూలై 5 నుండి సబ్సిడీ విడుదల ప్రక్రియ ప్రారంభమవుతుంది. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం, లాభదాయకం

**-తంబళ్లపల్లిలో ప్రకృతి వ్యవసాయం భేష్..**
**-ఖరీఫ్ లో వేరుశెనగ విత్తన కాయల పంపిణీకి ప్రణాళికలు**
**-వ్యవసాయ శాఖ జేడీ శివ నారాయణ**



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 19:** ప్రకృతి వ్యవసాయం ఆరోగ్య దాయకం, లాభ దాయకమని వ్యవసాయ శాఖ జేడీ శివ నారాయణ అన్నారు. బుధవారం ఆయన ఏఓ రమణ కుమార్ తో కలసి తంబళ్లపల్లి, బాలకవారిపల్లెల్లో వ్యవసాయ శాఖ, ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో రైతులు సాగు చేసిన (ఏటీఎం మోడల్) కూరగాయల పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. ఆరుతడి పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలు, సూక్ష్మ, బిందు సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ అవలంభించేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వ్యవసాయ శాఖ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి సేంద్రియ పద్ధతులలో సాగును పెంచాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 36,500 క్వింటాళ్ళ వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. విత్తన కాయలను జూన్ మొదటి వారంలో పంపిణీ చేసే విదంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వీఏఏ సురేశ్, ఏపీసీఎన్ఎఫ్ ఎన్ఎఫ్ఏలు చిరంజీవి, యశోద, సిబ్బంది నిజాం, రైతులు పాల్గొన్నారు.


# బైరెడ్డిపల్లి మండలం బాట పట్టిన ఆర్డీఓ భవాని

**- పరిష్కారం కానీ గ్రామ కంట దారి సమస్య**
**- 30 సంవత్సరాలు తరువాత ధాతలకే ఎదురుపడ్డ చిక్కుముడి**
**- సమస్య పరిష్కరం కోసం లెక్కలేనన్ని సార్లు అధికారుల దగ్గరికి ప్రదక్షిణలు**



**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 20 :** మండలంలోని దాసార్లపల్లి గ్రామ చివారున కర్ణాటక రాష్టానికి చెందిన యశోధమ్మ తాత అయిన వారు 1996లో గ్రామాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సర్వే నెంబర్ 63/1ఏ3లో 2 ఎకరాలు బీసీ కాలనీ నిర్మాణం కోసం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వశీ స్వాధీనం చేసుకొన్నది. భూయజమానికి చెల్లించాల్సిన సొమ్మును సైతం ఇంత వరకు తీసుకోలేదు. ఎందుకంటే 30 సంవత్సరాలు గా ప్రభుత్వం వద్దనే ఆ పరిహారం ఉన్నది. తామే వారసులంటూ పరిహా రం కోసం పరుగులు తీస్తున్నారు.మరో వైపు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమి పక్కనే గ్రామ కంట స్థలం కూడా ఉన్నది. దీనిని రైతు తనదేనని నలుగురికి అమ్మి నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం దగ్గర ఉన్న పరిహారం సొ మ్ము, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమి పోను మిగి లిన 30 సెంట్లు రైతుకు చెందుతుందని క్షేత్ర స్థాయిలో బుధువారం పర్యటించిన ఆర్డీఓ, తహసీల్దార్ గుర్తించా రు. మరో వైపు గ్రామ కంఠంలో అధికారుల పర్యవేక్షణ లేకుండా లబ్ది దారులు ఇల్లు కట్టుకోవడంతో దారి సమ స్య ఏర్పడింది. దాని సైతం అధికారులు పరిశీలించారు. ఈ సమస్య పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భవాణి, తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఆర్ ఐ ధమోధారచ్యారీ, వి ఆర్ ఓ వెంకటేష్, సర్వేర్ కార్తిక్, వి ఆర్ ఏ రామూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 20:** రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం తంబళ్లపల్లిలో చోటు చేసుకుంది.బాధితులు తెలిపిన వివరాల మేరకు..పెద్దమండ్యం మండలం చదివేవాండ్లపల్లెకు చెందిన శివమణి నాయక్,అరవింద్ నాయక్ తంబళ్లపల్లి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు.బుధవారం ఉదయం సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్ల కోసం ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లికి వచ్చి పట్టణానికి సమీపంలోని ఏటి గడ్డపల్లెకు స్నేహితులను కలిసేందుకు వెళ్లారు.ఈ క్రమంలో ములకలచెరువు రోడ్డులో హై స్కూల్ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ కోసం వేచి వున్న సతీష్ నాయక్, శ్రీనివాసులును ఢీ కొన్నారు.ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడగా స్థానికులు గమనించి హుటా హుటిన 108లో తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రికి చేర్చి ప్రథమ చికిత్సలు అందించారు. శివమణి నాయక్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

# ఘనంగా ప్రముఖ కథానాయకుడు యువ నందమూరి తారకరామారావు జన్మదిన వేడుకలు




**పుంగనూరు – ఆంధ్రనాడు, మే 20:** పుంగనూరు పట్టణం ఎన్టీఆర్ సర్కిల్‌లో యువ నందమూరి తారక రామారావు 41వ జన్మదిన వేడుకలను అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ టు ఎన్టీఆర్ అభిమాన సంఘ అధ్యక్షుడు డి అప్పిరెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం, జన్మదిన కేక్ కట్ చేసి జై ఎన్టీఆర్ జై జై ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేస్తూ కూడలి దద్దరిల్లింది, ఈ సందర్భంగా, అప్పిరెడ్డి యాదవ్ మాట్లాడుతూ, ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి తనయుడు నందమూరి హరికృష్ణ గారి ముద్దుబిడ్డ ప్రముఖ కథానాయకుడు యువ నందమూరి తారక రామారావు గారి 41 వ జన్మదిన వేడుకలను పుంగనూరు పట్టణం ఎన్టీఆర్ సర్కిల్లో జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు, నందమూరి తారక రామారావు గారు ఆయురారోగ్యాలతో ఆ కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదంతో నిండు నూరేళ్లు సుఖ సంతోషంగా ఉండాలని, తెలుగు ప్రజలే కాక భారతదేశ ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు పాల్గొన్నారు

## ముంజలు తీసి ఇవ్వండి... రుచి చూస్తాం - సీఎం చంద్రబాబు



**కుప్పం – ఆంధ్రనాడు, మే 20:** కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి దంపతులు తంజమ్మకొట్టాలు వద్ద ఆగారు. కల్లుగీత కార్మికులు తాటిముంజలు తీస్తుండగా కాన్వాయ్‌ను నిలిపి వారి వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు దంపతులు... ముంజలు తీసి ఇవ్వండి... రుచి చూస్తాం అని అడిగారు. కార్మికులు అందించిన తాజా తాటిముంజలను సీఎం దంపతులు రుచి చూశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులతో ముఖ్యమంత్రి కాసేపు ఆత్మీయంగా సంభాషించారు. వారి పనితీరు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పి కే యం ఉడ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

## సీఎం పర్యటనలో అధికారుల తీరుపై విమర్శలు



**కుప్పం – ఆంధ్రానాడు, మే 20:** ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన నేపథ్యంలో మీడియాకు అనుమతి లేదని అధికారులు పేర్కొన్నారు. అయితే స్థానికంగా ఉన్న సోషల్ మీడియా వ్యక్తులకు డ్యూటీ పాసులు మంజూరు చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాసులు అడిగితే మీకు అనుమతి లేదు. కేవలం లైవ్ లింక్ వాడుకోండి అని అధికారులు తెలిపారు. జర్నలిస్టులకు లేని పాసులు సోషల్ మీడియా సభ్యులకు ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి.

## ఆచార్య రాచపాళెంకు అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం



**తిరుపతి – ఆంధ్రానాడు, మే 20:** ప్రసిద్ధ అభ్యుదయకవి అడిగోపుల వెంకటరత్నం పేరుమీద ఆయన కుటుంబ సభ్యులు నెలకొల్పిన "అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం –2026" కు సుప్రసిద్ధ అభ్యుదయ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు అవార్డు వ్యవస్థాపకులు, అడిగోపుల కుటుంబ సభ్యులు వెల్లడించారు. జులై నెల రెండవ వారంలో తిరుపతిలో జరగనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని రాచపాలెంకు అందజేయనున్నట్లు ఆస్ట్రేలియా నుంచి "తెలుగుసందడి" సాహిత్య, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకుడు అడిగోపుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి శ్రీవెంకటే శ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, తెలుగు; పిహెచ్.డి (1970 – 77) చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయాలలో 38 ఏళ్ళు తెలుగు అధ్యాపకుడుగా పని చేశారు. 102 విమర్శ, పరిశోధన, కవిత్వ, సంపాదక పుస్తకాలు ప్రచురించారు. 45 మంది పరిశోధకులకు పర్యవేక్షకులుగా వ్యవహరించా రు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడుగా, నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సలహామండలి సభ్యుడుగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడిగా పని చేశారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు 23 పురస్కారాలు అందుకు న్నారు. అర్థ శతాబ్దకాలం సాహిత్య సేవలో 30 గ్రంథాలతో అభ్యుదయ కవిత్వాన్ని సమృద్ధి చేసిన "అడిగోపుల వెంకటరత్నం స్మారక పురస్కారాన్ని", తెలుగు సాహిత్య విమర్శను అర్థ శతాబ్దకాలం విస్తృతపరచిన ఆచార్య రాచపాలెంకు అందజేయడం సముచితంగా భావిస్తున్నామని అడిగోపుల శ్రీకాంత్ పేర్కొన్నారు. 50 సంవత్సరాలుగా మొక్కవోని దీక్షతో సాహిత్య విమర్శకు అంకితమైన ఆచార్య రాచపాలెం తెలుగు నేలంతా తెలిసిన విమర్శకులని అన్నారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను తనదైన భావజాలంతో నిరంతరం విశ్లేషించే రాచపాలెం ఎందరో యువ రచయితలకు ప్రోత్సాహమిస్తున్నారని తెలిపారు. ప్రాచీన కవిత్వం, ఆధునిక కవిత్వం, నవల, కథానిక, నాటకం, సాహిత్య విమర్శ, దాక్షిణాత్య సాహిత్యం, భారతీయ సాహిత్యం వంటి అనేక ముఖాలుగా తెలుగు సాహిత్య విమర్శను విస్తరింప చేస్తున్న విమర్శకులు రాచపాలెం ఈ పురస్కారానికి అన్ని విధాలా తగినవారని శ్రీకాంత్ వివరించారు. రాచపాలెం రచించిన "దరి – దాపు" గ్రంథం ఎం.ఏ తెలుగు విద్యార్థులకు పాఠ్య గ్రంథమైందని, ఆచార్య హెచ్.ఎస్ బ్రహ్మానందతో కలిసి రచించిన "సాహిత్య బోధనా పద్ధతులు" సాహిత్య అధ్యాపకులకు, "సాహిత్య పరిశోధన సూత్రాలు" గ్రంథం సాహిత్య పరిశోధకులకు నిత్యం ఉపయోగంలో ఉన్నాయన్నారు. ఆయన పర్యవేక్షణలో 40 మంది విద్యార్థులు పరిశోధన చేశారని తెలిపారు. రాచపా లెం రచించిన "మన నవలలు – మన కథానికలు" అనే గ్రంథానికి 2014లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. అంతటి ప్రసిద్ధ విమర్శకునికి అడి గోపుల పేరుతో పురస్కారం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

# తిరుపతి గంగమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు

- గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు





**కుప్పం – ఆంధ్రనాడు, మే 20:** కుప్పం గ్రామ దేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సీఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరితో కలిసి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆలయం పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జాతర కావడంతో దంపతులు ఇరువురు టీటీడీ తరపున గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఏడాదికి ఒక సారి మాత్రమే లభించే గంగమ్మ విశ్వరూప దర్శనాన్ని చేసుకుని, రాష్ట్రాన్ని గంగమ్మ చల్లంగా చూడాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకున్నారు. సీఎం చంద్రబాబుతో పాటు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, పలువురు నాయకులు జాతరలో పాల్గొన్నారు. గంగమ్మ దర్శనానికి ముందుగా కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లా అధికారులు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గంగమ్మ దర్శనం అనంతరం సీఎం అమరావతికి తిరుగు ప్రయాణమయ్యారు.



# తిరుపతి గంగమ్మ... కరుణామయి కరుణించు తల్లీ...

- వజ్రకిరీట విశ్వరూప దర్శనం
- తిలకించేందుకు పోటెత్తిన భక్తజనం
- వేషధారణతో మొక్కులు చెల్లించిన భక్తులు
- ముగిసిన గంగజాతర



**కుప్పం – ఆంధ్రనాడు, మే 20:** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం భక్తులకు కల్పించారు. సంవత్సరానికి ఓ సారి అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. విశ్వరూప దర్శనాన్ని చూసేకి వచ్చిన భక్తులు కుప్పం పట్టణంలో ఇసుక వేస్తే రాలనంత జనం కుప్పం రోడ్లపై కనిపించారు. ఏడాదికి ఓసారి మాత్రమే లభించే అమ్మవారి విశ్వరూప దర్శనానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారి విశ్వరూప దర్శనం చూసేటందుకు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అమ్మవారి విశ్వరూప దర్శించుకునేందుకు క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. గతంతో పోల్చితే ఈ ఏడు భక్తులు పెరిగి, జంతు బలులు అధికమయ్యాయి. మంగళ, బుధ వారాలలో అమ్మవారికి జంతు బలులు సమర్పణ కొనసాగింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు వివిధ వేషధారణలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తలపై పిండి దీపాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు సమర్పించుకున్నారు. అమ్మవారికి వజ్ర కిరీటంను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు వజ్రకిరీట విశ్వరూప దర్శనం కల్పించారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లికి భక్తులు మొక్కుబడులు చెల్లించారు. విచిత్ర వేషధారణ, పిండిదీపాలతో ఆలయానికి వచ్చి చిన్నా పెద్దా తల్లిపై ఉన్న ప్రేమను తెలిపేలా అమ్మా గంగమ్మ తల్లీ.. అంటూ క్యూలైన్లలో ఉక్కపోతకు ఇబ్బందులు పడుతున్న చేతులు జోడించి నీ చల్లటి కరుణామయి కరుణించు తల్లీ అంటూ వేడుకున్నారు.

**రాత్రి జలవాసం...**

అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం అర్ధరాత్రి అమ్మవారి శిరస్సును శరీర భాగం నుంచి వేరు చేసి అమ్మవారి జలవాస ఘట్టాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం మంగళవారం అమ్మవారి ఊరేగింపు, బుధవారం విశ్వరూప దర్శనం కల్పించి రాత్రి అమ్మవారిని జలవాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ట్రాఫిక్ ఆంక్షలు...**

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనం సందర్భంగా కుప్పం పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ను పూరిగా మళ్ళించారు. పట్టణంలోకి ఎలాంటి వాహనాలు అనుమతించలేదు. గంగమ్మ జాతర సందర్భంగా 350 మంది పోలీసులతో పట్టణంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డి.ఎస్.పి పార్థసారథి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..**

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం దర్శించుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సీఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ పొలిటికల్ చైర్మన్, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూర్ ఎమ్మెల్సీ భారత్, లకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

# భూసేకరణలో రైతులకు న్యాయం చేస్తాం

- ఎకరాకు రూ.28 లక్షల నష్టపరిహారం
- రైతులకు అండగా ప్రభుత్వం..
- పరిహారంతో పాటు ఉద్యోగాల హామీ
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్





**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 20 :** సత్యవేడు మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటీపాకం గ్రామాల్లో ఏపీఐఐసీ పరిశ్రమల అభివృద్ధి కోసం చేపడుతున్న భూసేకరణలో రైతులకు ఎకరాకు రూ. 28 లక్షల నష్టపరిహారం అందజేస్తామని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, విద్యార్హతలు కలిగిన రైతు కుటుంబాల పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్రరెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసేకరణ, నష్టపరిహారం, రైతుల సంక్షేమంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూములకు అందించే పరిహారంతో పాటు మామిడి చెట్లు, ఇతర వృక్షాలు, బోర్‌వెల్లు, షెడ్లు, గోడలు, కట్టడాలు వంటి స్థిరాస్తులకు ప్రత్యేక అంచనాల ప్రకారం అదనపు పరిహారం కూడా చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు. దీంతో రైతులకు మరింత న్యాయం జరుగుతుందన్నారు. శ్రీసిటీ ఏర్పాటుతో ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. ప్రస్తుతం చేపడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు కూడా యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పరిహారం విషయంలో అభ్యంతరాలు ఉన్న రైతులు చట్టబద్ధంగా ఆర్బిట్రేషన్‌కు వెళ్లే అవకాశం ఉందని వివరించారు. ఈ సమావేశంలో సత్యవేడు తహసీల్దార్ శివప్రసాద్, సంబంధిత అధికారులు, గ్రామ వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఔషధ రంగ సమస్యలపై కెమిస్టుల ఆగ్రహం

**- పీలేరులో భారీ ర్యాలీ.. తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం**



**పీలేరు – ఆంధ్రనాడు, మే 20**: అఖిల భారత కెమిస్టు మరియు డ్రగ్గిస్టుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పీలేరు పట్టణంలోని మెడికల్ షాప్ యజమానులు, కెమిస్టులు బుధవారం ఐక్యంగా ముందుకు వచ్చి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 12.40 లక్షలకుపైగా కెమిస్టులు, డ్రగ్గిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు ఔషధ వ్యాపార రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ రంగంపై కోట్లాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నప్పటికీ, ఇటీవలి పరిణామాలు చిన్న, మధ్యతరహా మెడికల్ వ్యాపారుల మనుగడకు ముప్పుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా అక్రమ ఈ–ఫార్మసీల విస్తరణ, పెద్ద కార్పొరేట్ సంస్థల అనైతిక ధరల విధానం, నియంత్రణల లోపం కారణంగా స్థానిక మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. చట్టపరమైన పర్యవేక్షణ లేకుండా ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలు జరగడం ప్రజారోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. వైద్యుల సూచనలు లేకుండా మందులు అందుబాటులోకి రావడం, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం పెరగడం, నకిలీ ప్రిస్క్రిప్షన్ల వినియోగం, నాణ్యతలేని మందుల సరఫరా, ఫార్మసిస్టు––రోగి మధ్య ప్రత్యక్ష సంబంధం తగ్గిపోవడం వంటి అంశాలు భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమ ఈ–ఫార్మసీల నియంత్రణ, కార్పొరేట్ సంస్థల అనైతిక విధానాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ సెన్సస్ విధుల్లో బిజీగా ఉండటంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ ఉద్యమం కేవలం వ్యాపార ప్రయోజనాల కోసం కాదని, ప్రజారోగ్య పరిరక్షణ, ఔషధ రంగంలో పారదర్శకత, నియంత్రణ కోసం చేపడుతున్న ఉద్యమమని సంఘ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ యజమానులు, సంఘ ప్రతినిధులు మహేష్, వెంకటేష్, నాగరాజ, సురేంద్ర, రాజేష్, శంకర, భాస్కర, సుబ్బయ్య, ఇలియాజ్, చలపతి, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశవాణి 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యాసరచన పోటీలు




**తిరుపతి – ఆంధ్రనాడు, మే 20:** ఆకాశవాణి భారతీయ ప్రసార రంగంలో తొంభై ఏళ్ల సేవలను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 'ఆకాశవాణి తిరుపతి కేంద్రం వేమన విజ్ఞాన కేంద్రం" సంయుక్తంగా "స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణంలో ఆకాశవాణి పాత్ర " అనే అంశం పై బుధవారం వ్యాసరచన పోటీలు వేమన విజ్ఞాన కేంద్రం లోనిర్వహించడం జరిగింది. ఈ పోటీలు జూనియర్స్ 6,7 తరగతులు, సీనియర్స్ 8,9,10 తరగతులు,సూపర్ సీనియర్స్ ఇంటర్, డిగ్రీ విద్యార్థులు మొత్తం మూడు గ్రూపుగా ఈ పోటీలు జరిగాయి. ఇందులో విజేతలు గా జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి టి. హిర న్మయి,ద్వితీయ బహుమతి ఎన్. దరణి స్వరెడ్డి,తృతీయ బహుమతి జాహ్నవి చౌదరి,సీనియర్స్ విభాగంలోప్రథమ బహు మతి పి. భూమిక, ద్వితీయ బహుమతి ఎం. పవిత్ర రెడ్డి, తృతీయ బహుమతి టి.హేమానంద రెడ్డి, సూపర్ సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి డి. నేహశ్రీ, ద్వితీయ బహుమతి కె. తులసిసాక్ష, తృతీయ బహుమతి అర్ ఎస్ షాలిని గెలుపొందారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆకాశవాణి తిరుపతి కేంద్రం సహాయ సంచాలకులు ఎం.సుధాకర్ మోహన్,వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున లు మాట్లాడుతూ ఆకాశవాణి ప్రజల జీవితాల్లో, సమాచార,విద్యా,వినోద రంగాల్లో పోషించిన విశిష్ట పాత్రను ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. అనంతరం ఈ పోటీలో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందచేశారు. పాల్గొన్న విద్యార్థులకు అందరికీ సర్టిఫికెట్లు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జక్యూటివ్ సాయి రఘునాథ్ ,వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధుల టెంకాయల దామోదరం, గురునాథం, డా. గోపాల్, జయరామయ్య, రెడ్డెప్ప, రఫీ, డా.రవీంద్ర కుమార్, డా.నెమిలేటి కిట్టన్న, ఎన్వీ రమణ ప్రసాద్, విశ్వనాథ రెడ్డి, చెస్ బాలాజీ చౌదరి తదతరులు పాల్గొన్నారు.

## శ్రమ శక్తి అవార్డు ప్రధానం



**తిరుపతి, మే 20, (ఆంధ్రనాడు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 20 26 సంవత్సరానికి శ్రమ శక్తి అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళక్షేత్రమునందు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులమీందిగా 114 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి .దేవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. ఎస్. ఆర్. కె. గణపతి, కార్యనిర్వాక అధ్యక్షులు సంజీవరావు ఎస్పీడీసీఎల్ డిష్ కం ప్రెసిడెంట్ ఏ.వి .రమణ, శ్రీకాకుళం రీజనల్ అధ్యక్షులు శ్రీకాంత్, విశాఖపట్నం రీజినల్ అధ్యక్షులు నూకరాజు అవార్డును అందుకోవడం జరిగింది. ఈ అవార్డు రావడం పట్ల వారికి తిరుపతి రీజియన్ తరపున వారికి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. వారు భవిష్యత్తులో మరిన్ని అవార్డులను తీసుకోవాలని కలియుగ వెంకటేశ్వర స్వామిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని వారు పేర్కొన్నారు.

## పెండింగ్ పనులపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

**- రైల్వే, జాతీయ రహదారులు, భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 20:** తిరుపతి జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణ పనులు, భూసేకరణ, ఏపీఐఐసీ పరిశ్రమల ప్రాజెక్టులు, పట్టాదారు పాసుబుక్ పంపిణి, మ్యుటేషన్, రీ–సర్వే, పీజీ ఆర్ఎస్, సెన్సెస్ తదితర అంశాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వర్చువల్ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డీఆర్వో జి. నరసింహులు తదితర అధికారులతో కలిసి కలెక్టర్ వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీసిటీ, ఏపీఐఐసీ పరిధిలోని ఎల్‌జీ ఫేజ్‌లు, నాయుడుపేట, నెల్లూరు, పాగలి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్ కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు వెబ్‌ల్యాండ్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వైజాగ్–చెన్నై కారిడార్ పైప్‌లైన్, నడికుడి–శ్రీకాళహస్తి, గుమ్మడిపూండి–గూడూరు, గూడూరు–రేణిగుంట, తిరుపతి–కాట్పాడి తదితర రైల్వే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని చెప్పారు. నాయుడుపేట–రేణిగుంట, రేణిగుంట–కడప, రేణిగుంట–చెన్నై రహదారి విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పట్టాదారు పాసుబుక్ పంపిణి, మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం పారదర్శకంగా జరగాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలు అందించాలని తెలిపారు. రీ–సర్వే, పీజీఆర్ఎస్, సెన్సెస్ కార్యక్రమాలను ప్రాధాన్యంతో చేపట్టాలని, పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రతి అంశంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, శ్రీ సిటీ లీగల్ అడ్వైజర్ భాను, సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, శివప్రసాద్, భూసేకరణ విభాగ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రాణాలు పోతున్నాయి - ఎల్ఈడీ హెడ్‌లైట్లతో నరకంగా మారిన రాత్రి ప్రయాణం

**పీలేరు – ఆంధ్రనాడు, మే 20:** అధిక వెలుతురు వల్ల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు "సగం బ్లాక్ స్టిక్కర్" నిబంధన మాయం. నియంత్రణలో విఫలమైన అధికారులు రాత్రి వేళల్లో రోడ్లపై ప్రయాణం అంటే ఒకప్పుడు ప్రశాంతత, చల్లదనం గుర్తుకొచ్చేవి. కానీ ఇప్పుడు అదే రాత్రి ప్రయాణం వాహనదారులకు భయానక అనుభవంగా మారుతోంది. కారణం – ఎదురుగా వచ్చే వాహనాల నుంచి వెలువడుతున్న అధిక కాంతి గల ఎల్ ఇ డి హెడ్‌లైట్లు. ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న కొత్త కార్లు, బైకులు అధిక పవర్ గల తెల్లని ఎల్ఈడీ లైట్లతో వస్తున్నాయి. ఇవి డ్రైవర్‌కు దూరం స్పష్టంగా కనిపించేలా చేయడానికే అయినప్పటికీ, ఎదురుగా వచ్చే వాహనదారులకు మాత్రం ప్రమాద సంకేతాలుగా మారుతున్నాయి. ఒక్కసారిగా కళ్లలోకి పడే ఆ కాంతి వల్ల కొన్ని క్షణాల పాటు రోడ్డు కనిపించకుండా పోవడం, కళ్ల మసకబారడం, దృష్టి కోల్పోవడం జరుగుతోంది. ఆ కొన్ని సెకన్లే ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

**కంటికి కనిపించని ప్రమాదం**

రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం హై బీమ్ లేదా అధిక పవర్ ఎల్ఇ డి లైట్ ఆన్ చేసి వస్తే, ఎదురుగా ఉన్న డ్రైవర్ కళ్లలో తీవ్ర గ్లేర్ ఏర్పడుతుంది. ముఖ్యంగా గ్రామీణ రహదారులు, డివైడర్ లేని రోడ్లు, మలుపులు ఉన్న ప్రాంతాల్లో ఇది మరింత ప్రమాదకరంగా మారుతోంది. బైక్ రైడర్లు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. "ఎదురుగా



లైట్ పడితే కాసేపు ఏమీ కనిపించదు. బ్రేక్ వేయాలా, సైడ్ ఇవ్వాలా కూడా అర్థం కాని పరిస్థితి వస్తోంది" అని పలువురు వాహనదారులు చెబుతున్నారు.

**పాత నిబంధన ఎక్కడ పోయింది...?**

గతంలో వాహనాల హెడ్‌లైట్లకు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ లేదా బ్లాక్ పెయింట్ వేయడం తప్పనిసరి అనే నిబంధన అమలులో ఉండేది. దీని వల్ల లైట్ తీవ్రత కొంత వరకు తగ్గి ఎదురుగా వచ్చే వారికి ఇబ్బంది తక్కువగా ఉండేది. అదే విధంగా "డిప్పర్ ఎట్ నైట్" అనే అవగాహన కార్యక్రమాలు కూడా జరిగేవి. అవసరం లేకుండా హై బీమ్ వాడితే పోలీసులు జరిమానాలు విధించేవారు. కానీ ప్రస్తుతం ఆ నిబంధనలు పూర్తిగా కనుమరుగైనట్లుగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు చాలామంది వాహనదారులు ఫ్యాషన్, స్టైల్ పేరుతో మార్కెట్‌లో లభించే అధిక పవర్ ఎల్ఇడి లైట్లు అమర్చుకుంటున్నారు. ఇవి రవాణా నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది చూసే వ్యవస్థ కూడా కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఆర్టీవో, ట్రాఫిక్ శాఖల నిర్లక్ష్యం...?**

రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాల ఫిట్‌నెస్ చెక్ సమయంలో హెడ్‌లైట్ ఫోకస్, కాంతి తీవ్రత, హై బీమ్ వినియోగంపై తనిఖీలు జరగాల్సి ఉన్నా అవి కేవలం పత్రాల పరిశీలనకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధిక కాంతి వెదజల్లే లైట్ల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నప్పటికీ, వాటిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం లేదని వాహనదారులు అంటున్నారు.

**ప్రజల డిమాండ్లు ఇవే...**

అధిక పవర్ ఎల్ ఇ డి లైట్లపై ప్రత్యేక నియంత్రణ తీసుకురావాలి హెడ్‌లైట్లకు బ్లాక్ స్టిక్కర్ నిబంధనను పునరుద్ధరించాలి అవసరం లేని హై బీమ్ వినియోగంపై జరిమానాలు విధించాలి ఆర్టీవో తనిఖీల్లో హెడ్‌లైట్ ఫోకస్ పరీక్ష తప్పనిసరి చేయాలి "డిప్పర్ ఎట్ నైట్"పై మళ్లీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

**చర్యలు తీసుకోకపోతే ప్రమాదాలే...**

రోడ్డు భద్రతలో వాహనాల వేగం ఎంత ముఖ్యమో, హెడ్‌లైట్ల నియంత్రణ కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక అభివృద్ధి పేరుతో వచ్చే ప్రతి మార్పు భద్రతకు అనుకూలంగా ఉండాల్సిందే కానీ, ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. రాత్రి వేళల్లో వాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలంటే ఎల్ ఇ డి లైట్ల నియంత్రణపై ప్రభుత్వం, రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై తిరుపతి లో ఏఐటీయూసీ వినూత్న నిరసన

**- పొదుపు మేము చేయాలి**
**- నీవు ధరలు పెంచుకుంటూ పోవాలా**
**- ఇదేనా మోదీ నీ విధానం - ఏఐటీయూసీ విమర్శ**
**- ఇలా ధరల పెంచుకుంటూ పోతే ప్రజల ప్రతిఘటన తప్పదు**
**- ఏఐటియుసి సిపిఐ చూస్తూ ఊరుకోదు**
**- ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష**
**- ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణ**
**- మద్దతు ప్రకటించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి**




**తిరుపతి, మే 20, (ఆంధ్రనాడు):** కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోలు డీజిల్ ధరలపై మూడు రోజుల మనుపు రూ మూడు రూపాయలు అదనంగా పెంచడాన్ని.నిరసిస్తూ ఏఐటీయూసీ తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వినూత్నంగా వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది ఆటో కార్మికుల బతుకులతో చెలగాటమాడుతున్నావు పెట్రోల్ డీజిల్ ధరల పెంపు వల్ల మా బతుకులు రోడ్ల పాలవుతున్నాయి మా జీవితాలకు పంగనామాలు పెడుతున్నావు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీవనం సాగించలేక మా బతుకులు ఉరితాళ్ల కు వేలాడాల్సిన పరిస్థితులు దాపరిస్తున్నాయి రానున్న కాలంలో వాహనాలు చూడటానికి ఉపయోగపడతాయి తప్ప తోలడానికి కాదు అంటూ వాహనాలకు పూజలు చేస్తూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్నఅంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ రూపాలలో వినూత్న నిరసన కార్యక్రమాలను ఏఐటీయూసీ చేపట్టింది.ఆటోలకు పూజలు చేస్తూ తాడులతో లాగుతూ భవిష్యత్తులో మోడీ ప్రధానిగా ఉంటే ఇంకా ఇలాగే మనం బతకాలని నినాదాలు ఇస్తూ నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు పి మురళి రాధాకృష్ణ చంద్రశేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన ఎన్నికల సభలో మోడీ మాట్లాడుతూ భవిష్యత్తులో పెట్రోల్ డీజిల్ ధరలు పెరగవని చెబుతూ ఎన్నికలు పూర్తవుగానే మూడు రోజు నుండే పెట్రోల్ డీజిల్ మూడు రూపాయల వరకు పెంచారని ఇది చాలా దున్నట్టు నిన్న మరో రూపాయి పెంచార ని ఆయన విమర్శించారు ఈ ధరల పెరుగుదల వలన భవిష్యత్తులో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతాయని ప్రజలు మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులు పడతారని ఇలా పెంచుకుంటూ పోతే ప్రజల ప్రతిఘటన తప్పదని నాయకులు హెచ్చరించారు .మరోపక్క దేశ ప్రజలంతా పొదుపుగా ఉండాలని డీజిల్ వాడకూడదని బంగారం కొనకూడదని చెప్పిన మోదీ ఆయన విదేశీ పర్యటనలకు ఆయన వేసుకున్న సూట్ ఎన్ని కోట్లు ఖర్చవుతుందో ప్రజలకు శ్వేత పత్రం విడుదల చేయాలని మధు డిమాండ్ చేశారు .భవిష్యత్తులో ఒక పూట భోజనం చేయండి మరొక పూట యోగా చేయండి అంటారేమని భయమేస్తుంది అని వ్యంగ్యంగా అన్నారు ఇంకా మీకు ఆకలి వేస్తే ధ్యానం చేయండి దాంతో అన్ని సమస్యలు తీరుతాయి యోగా చేయండి అని మోడీ గారు సెలవిస్తారని వారు తెలిపారు గతంలో ఏ ప్రధాని ఇటువంటి నిర్ణయాలు తీసుకోలేదని అనేక సంక్షోభాలు యుద్ధాలు వచ్చిన ప్రజలపై భారాలు మోపు లేదని తెలిపారు పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రజలు మేధావులు కార్మిక వర్గం పెద్ద ఎత్తున కదిలి రోడ్లపైకి రావాలి అని వారు పిలుపునిచ్చారు 5 రాష్ట్ర ల ఎన్నికలు అయ్యాయి. బీజేపీ అసలు రంగు బయట పెట్టింది. మూడు రోజులకు మునుపు పెట్రోల్ 3.14, డీజిల్ 3.11 రూపాయల పెంచి తన దాహన్నీ తీర్చుకుంది.దేశం కోసం ధర్మం కోసం హిందువుల కోసం నరేంద్ర మోడీ గారు ఇచ్చిన ఈ భారీ గిఫ్ట్ ను మరిచిపోక మునిపే నిన్నటి రోజు మరోసారి పెట్రోలు లీటరు పై మరో రూపాయి రూపాయి పెంచి కార్మికుల నడిచింది పెట్రోల్ డీజిల్ పెంపు వల్ల నిత్యవసర సరుకులు భార్యగా పెరుగుతాయి తద్వారా నరేంద్ర మోడీ నిజస్వరూపాన్ని భారత ప్రజలు అర్థం చేసుకోవాలని రోడ్లపైకి రావాలని పోరాటాలకు సిద్ధపడాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్ డి రవి అధ్యక్షత వహించగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చెన్నం పెంచలయ్య మద్దతు తెలియజేశారు ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు ఎన్ శివ ప్రధాన కార్యదర్శి ఎన్ డి రవి ,నాయకులు వెంకటేష్ సురేష్ ఏపీ బాల మహేంద్ర సురేష్ ఆర్ వి రమేష్ సతీష్ రాము ప్రమీల మురళి కాశి నవీన్ సెందిల్ తదితరులు పాల్గొన్నారు

# దళితులపై జగన్ ప్రభుత్వంలో దాడులు

**తిరుపతి ఆంధ్రనాడు, మే 20:** తిరుపతి తిమ్మినాయుడు పాళ్యం నందు తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మన్నూరు సుగుణమ్మ ఆద్వర్యంలో దళితులపై జగన్ ప్రభుత్వ దాడులు అనే కార్యక్రమం పైన వార్డ్ నందు అవగాహన కార్యక్రమం చెప్పటడ్డం జరిగినది. సుగుణమ్మ మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం ఒకటి కాదు దళితులపై అనేక విధాలుగా దాడులు చేసింది. మా ఎస్సీలు, మా ఎస్టీలు అంటూ మాటలు చెప్పినా నిజంగా దళితుల గొంతు నొక్కింది జగన్ ప్రభుత్వమే. జగన్ పాలనలో ఐదేళ్లలో 200 మందికి పైగా దళితులు హత్యలకు గురయ్యారు.దళితులపై ఎంతగా అణచివేత జరిగిందో డాక్టర్ సుధాకర్ ఘటన, కిరణ్ ఘటన, డాక్టర్ అచ్చెన్న ఘటనలే ఉదాహరణలు.దళితుల పై దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోయాయని స్వయంగా రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.టీడీపీ పాలనలో ఐదేళ్లలో 8,211 అఘాయిత్యాలు నమోదైతే వైసీపీ పాలనలో 56,981 కేసులు నమోదయ్యా యి.2014--19 కాలంలో పోలిస్తే వైసీపీ హయాంలో దళితులపై దాడులు 10 రెట్లు పెరిగాయి.జగన్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల్లో వేల కోట్ల రూపాయలను మళ్లించి దళితుల అభివృద్ధిని అడ్డుకుంది.లక్షలాది దళిత యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది.. వైసీపీ నాయకుల అండతో దళితులపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.జగన్ హయాంలో దళిత యువకుడు కిరణ్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోలేదు.దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను అవమా నించిన ఘటనలో కూడా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయలేదు.దళిత కోనసీమ జిల్లాలో అంబేద్కర్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన అల్లర్లలో దళితుల




ఇళ్లు, ఆస్తులు దెబ్బతిన్నాయి.కరోనా సమయంలో సేవలందించిన దళిత డాక్టర్ సుధాకర్‌ను రోడ్డుపై అవమానకరంగా వ్యవహరించడం రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహానికి కారణమైంది.వైసీపీ కార్యకర్తల దాడులతో దళితులపై బెదిరింపులు, భయాందోళనలు పెరిగి పోయాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

అక్రమాలను ప్రశ్నించిన దళితులపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వైసీపీ నాయకుల ప్రవర్తన కొనసాగిందనే ఆరోపణలు ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో దళిత యువతి అఘాయిత్యానికి గురై హత్య చేయబడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జగన్ సొంత నియోజకవర్గం పులి వెందులలో కూడా దళిత మహిళలపై దాడులు జరిగినా ప్రభుత్వం స్పందించ లేదనే విమర్శలు వచ్చాయి. అనంతపురం జిల్లా ధర్మవరంలో దళిత యువతి పై జరిగిన అఘాయిత్యం, హత్య ఘటన ప్రజలను కలచివేసింది.మహిళా డాక్టర్ అనితారాణిపై వైసీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించి అవమానకర వ్యాఖ్యలు చేసిన ఘటన కూడా పెద్ద చర్చకు దారితీసింది. రాజమండ్రి లో 16 ఏళ్ల దళిత బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వచ్చాయి. గుంటూరు జిల్లా వేదచర్లలో చదువుకుంటున్న దళిత విద్యార్థిని హత్య ఘటన ప్రజల్లో భయాందోళనలు కలిగించింది.

ఈ కార్యక్రమానికి క్లస్టర్ ఇంచార్జ్ బి.జి. కృష్ణ యాదవ్ ,వార్డ్ యూనిట్ ఇంచార్జ్ వెంకటరత్నం ,విజయ్ , సుల్తానా , మహేష్ , లోక యాదవ్ , రుద్రారెడ్డి ,సూరా సుధాకర్ ,దంపూరి భాస్కర్ యాదవ్ ,మన్యం శ్రీనివాసులు ,అన్నా అనిత ,చందన స్రవంతి ,నరేష్ రెడ్డి ,సుబ్బయ్య ,గీత ,బ్యాంక్ శాంతమ్మ ,హేమావతి ,బాలాజీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఏంటయ్యాఆనంద్ రెడ్డి బాగున్నావా
## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలకరింపు






**రామకుప్పం -ఆంధ్రనాడు, మే 20:** కుప్పం శ్రీతిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలను సతి సమేతంగా అమ్మవారికి మొక్కు చెల్లించారు ఈ సందర్భంగా భారీ జనసందోహం ఉన్నది అమ్మవారికి మొక్కులు చెల్లించి తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారు ఎక్కాడు జన సందోహంలో అక్కడే ఉన్న రామకుప్పం మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డిని చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారు దిగి స్వయంగా వెళ్లి పలకరించాడు ఏంటయ్యా ఆనంద్ రెడ్డి బాగున్నావా మండల పార్టీ పరిస్థితి ఏమి అని విచారించారు తర్వాత హెలిపాడ్ వద్ద కలవమన్నారు దానితో ఆనందరెడ్డి మరల హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలిశారు మండల పరిస్థితులు పూర్తి సమాచారం ఉన్నదని బాగా పని పనిచేస్తున్న భవిష్యత్తు ఉంటుందని ఆయనకు హామీ ఇచ్చినట్టు సమాచారం అంతమంది జన ప్రవాహంలో రామకుప్పం మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేరు పెట్టి పిలవడం గొప్ప విషయశీ, దీనిని బట్టి చూస్తే త్వరలో రాజకీయ పదవి యోగం లభించనున్నదని తెలుగుదేశం పార్టీ వర్గాల ద్వారా సమాచారం ఏది ఏమైనా మండల స్థాయి నాయకుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా మాట్లాడడం చర్చనీయాంశంమైది.

## ఆన్లైన్లో మందులు అమ్మకాలను వెంటనే నిలుపుదల చేయాలి

**- కె.వి చౌదరి**

**తిరుపతి హెల్త్ -ఆంధ్రనాడు, మే 20 :** ఆన్ లైన్ మందుల అమ్మకాలను నిలుపుదల చేయాలని కోరుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, ఎస్.బి.బి మెడికల్ స్టోర్ చైర్మన్ కె.వి చౌదరి, ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసిడి) పిలుపు మేరకు బుధవారం దేశవ్యాప్తంగా మందుల షాపుల బంద్ లో భాగంగా తిరుపతిలో జరిగిన హోల్ సేల్ మెడికల్ ఏజెన్సీ, మెడికల్ షాపుల బంద్ అన్ని మెడికల్ అసోసియేషన్ నాయకులు, పలు మెడికల్ యూనియన్ నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ చౌదరి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వచ్చిన ఆదేశాలను అడ్డంగా పెట్టుకుని అక్రమ దందా జరుగుతుందని ఆరోపించారు. ఆన్లైన్ బిజినెస్ లో నకిలీ మందులతో పాటు ప్రమాదకరమైన మందులు సరఫరా అవుతున్నాయని, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆన్లైన్ సేవలకు ఫుల్ స్టాప్ పెట్టాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. సరైన పరీక్షలు చేయకుండానే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో మందులు అమ్ముతున్నారని, ఇది రోగుల భద్రతకు పెద్ద ముప్పుగా పరిణమించవచ్చని హెచ్చరించారు. అంతేకాకుండా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో మందులను భారీ తగ్గింపులకు అమ్మడం చిన్న దుకాణదారుల వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. స్థానిక వైద్య దుకాణాలపై ప్రజలు ఆధారపడే గ్రామాలు, చిన్న పట్టణాలలో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అనేక చిన్న మందుల దుకాణాలు మూతపడవచ్చని, దీనివల్ల మందుల లభ్యతపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మద్దతుగా నవ సమాజ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు నీలా విజయభాస్కర్ మాట్లాడుతూ ఆన్ లైన్ లో మందులు అమ్మకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెక్ పెట్టాలన్నారు. నకిలీ మందుల విక్రయాలను అరికట్టి నాణ్యమైన మందులు ప్రాణాంతకరమైన లైఫ్ టైం మెడిసిన్స్ వైద్యుల సూచన మేరకే విక్రయాలు జరిగేలాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి సాధించాలని కోరారు. అనేక ఈ-ఫార్మసీ వెబ్‌సైట్లు సరైన వైద్య ధృవీకరణ లేకుండా మందులను పంపిణీ చేస్తున్నాయని ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ ఆరోపిస్తున్నాయి. పాత ప్రిస్క్రిప్షన్‌లను తరచుగా తిరిగి వాడుతున్నారు, ఇప్పుడు, ఏఐ సాంకేతికతతో, మందులను కొనుగోలు చేయడానికి నకిలీ ప్రిస్క్రిప్షన్‌లను సృష్టించవచ్చని, ఇది యాంటీబయాటిక్‌ల దుర్వినియోగం, వ్యసనపరులైన మందుల దుర్వినియోగంలో వేగవంతమైన పెరుగుదలకు దారితీయడమే కాకుండా భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చని వాపోయారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, లోకేష్, హరి,ధనుంజయలు తిరుపతి హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంవత్సరం మొదలవ్వకుండానే
# అడ్మిషన్స్ నిర్వహించడం ఏంటి విద్యాశాఖ మంత్రి

- పలమనేరులో కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న విద్యాశాఖ అధికారులు
- ముందస్తు అడ్మిషన్లను రద్దు చేయాలి
- అధికారిక షెడ్యూల్‌కు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టకూడదు.
- సంజయ్ ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు

**పలమనేరు– ఆంధ్రనాడు,మే 20 :** పలమనేర్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఎదుట అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, విద్యా రంగం వ్యాపారంగా మారిపోవడం ఎంతో ప్రమాదకరమని, ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు మరియు తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపడం అసహనకరమని అన్నారు. ప్రస్తుతం శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో విద్యా సంవత్సరం మొదలవ్వకుండానే వాళ్ళు ఇష్టానుసారంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని వాటి గురించి విద్యాశాఖ అధికారులకు విన్నవిస్తే విద్యా సంవత్సరం మొదలవ్వకపోయినా అడ్మిషన్లు చేసుకోవచ్చని విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు



అదేవిధంగా కార్పొరేట్ పాఠశాలలలో అధిక ఫీజులను వసూలు చేస్తూ ప్రభుత్వ నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు నిర్మాణాన్ని పాటించకుండా ఇష్టాను సారంగా ఫీజులు పెంచడం వల్ల సాధారణ మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఈ అధిక ఫీజుల వసూలును నిలిపివేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ఫీజులు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను ఆకర్షించడం పూర్తిగా తప్పని అన్నారు. అధికారిక అడ్మిషన్ షెడ్యూల్‌కు ముందే ప్రవేశాలు ఇవ్వడం ద్వారా తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేయడం అనైతికమని చెప్పారు. ఈ విధమైన ముందస్తు అడ్మిషన్లను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ మార్గదర్శకాలకు కట్టుబడి వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాల విషయంలో కూడా స్కూల్ యాజమాన్యం బలవంతపు విధానాలు అనుసరిస్తోందని ఆయన ఆరోపించారు. తల్లిదండ్రులను ఒకే చోట కొనాలని ఒత్తిడి చేయడం ద్వారా అధిక ధరలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇది పూర్తిగా అన్యాయం అని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వేచ్ఛ ఇవ్వాలని, బలవంతపు విక్రయాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించలేకపోతే విద్యార్థులను అవమానించడం, ఒత్తిడి చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి అమానుష చర్యలను వెంటనే నిలిపివేయాలని ఆయన గట్టిగా హెచ్చరించారు.ఈ డిమాండ్లను వెంటనే పరిష్కరిం చకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి విద్యా రంగంలో జరుగుతున్న అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అమాన్, అమాంశ్, సమీర్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్ సిఐగా శ్రీనివాసులు

**తిరుపతి -ఆంధ్రనాడు,మే 20:** స్థానిక ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిఐగా వి. శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 ఎస్ఐగా కర్నూలు జిల్లాలోని గోసపాడు నందు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. అలాగే 2021లో సిఐగా పదోన్నతి పొంది పళ్ళు చోట్ల పనిచేశారు. ప్రస్తుతం బదిలీపై ఈస్ట్ పోలీస్ స్టేషన్లో సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రౌడీ షీటర్ల పై ఉక్కు పాదం మోపుతామని వివరించారు .



ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరక్కుండా కఠినమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు అలాగే రైల్వే స్టేషన్ బస్ స్టాండ్ శ్రీనివాసం, విష్ణు నివాసం, యాత్రికులు అవగాహన కల్పించి దొంగతనాల నివారణకు కృషి చేస్తామన్నారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పి రవి మనోహర్ ఆచారి, ఈస్ట్ డిఎస్పి భక్తవత్సలం లను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధితులు చేపట్టిన సిఐని మర్యాదపూర్వకంగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐలు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

## సేవా కార్యక్రమాలతో
# జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

**మదనపల్లి -ఆంధ్రనాడు, మే 20:** ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా రక్తదాన శిబిరం, ఉచిత హెల్మెట్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టి అభిమానాన్ని చాటుకున్నారు.గజ్జల ఈశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో యువత స్వచ్ఛందంగా పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో అనేక మంది ముందుకు వచ్చి రక్తదానం చేయగా, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ప్రజలకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అభిమానులు కేక్ కట్ చేసి తమ అభిమాన నటుడికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గజ్జల ఈశ్వర్ నాయుడు మాట్లాడుతూ... తారక్ పుట్టినరోజును ప్రతి ఏడాది సామాజిక బాధ్యతతో జరుపుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. యువత ప్రాణాల రక్షణ





దృష్ట్యా హెల్మెట్ల పంపిణీ, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్ర యాదవ్, ముదివేడు షేక్ అయూబ్ బాషా, శేఖర్ తదితరులతో పాటు అభిమాన సంఘాల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒక్క బెర్తు.. రేసులో ఐదు జట్లు

## - ప్లే-ఆఫ్స్ కు ఆర్సీబీ, సన్ రైజర్స్, గుజరాత్
## - ముంబయి, లక్నో ఎలిమినేట్




ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-19 లీగ్ దశ మ్యాచ్‌లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సీజన్ ఆరంభంలో అదరగొట్టిన పంజాబ్, రాజస్తాన్ జట్లు ఆ తర్వాత వరుస పరాజయాలతో ప్లే-ఆఫ్స్ బెర్త్ ను ఖాయం చేసుకోలేకపోయాయి. ఇక కోల్ కతా, ఢిల్లీ, చెన్నై చివరి మ్యాచుల్లో గెలిచి ప్లే-ఆఫ్స్ బెర్తును కొట్టేయాలని ఎదురు చూస్తున్నాయి. ఎం. చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన లీగ్ మ్యాచ్ లో గెలిచిన సన్ రైజర్స్ ప్లే-ఆఫ్స్ కు చేరగా.. ఈ గెలుపుతో గుజరాత్ కూడా నేరుగా నాకౌట్ బెర్త్ కొట్టేసింది. సీజన్ ఆరంభంలో అదరగొట్టిన లక్నో సూపర్ జెయింట్స్, ఐదుసార్లు ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ చివరి 4 మ్యాచులు మిగిలి ఉండగానే ఎలిమినేట్ అయ్యాయి.

**ప్లే-ఆఫ్స్ బెర్త్ పై ఉత్కంఠ...** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) 13 మ్యాచుల్లో 9 విజయాలతో 18 పాయింట్లతో, సన్ రైజర్స్, గుజరాత్ జట్లు 13 మ్యాచుల్లో 8 విజయాలతో 2, 3 స్థానాల్లో నిలిచి ప్లే-ఆఫ్స్ కు చేరాయి. ఇక రాజస్తాన్ 13 మ్యాచులు ముగిసేసరికి 14పాయింట్లతో 4వ స్థానంలో ఉన్నా ప్లే-ఆఫ్స్ కు చేరలేదు. పంజాబ్ 13 పాయింట్లతో 5వ స్థానంలో ఉండగా.. చెన్నై, ఢిల్లీ 12 పాయింట్ల తో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఇక కోల్ కతా 12మ్యాచ్ లు ముగిసేసరికి (11పాయింట్లు) 8వ స్థానంలో ఉన్నాయి.

**రాజస్తాన్, కోల్ కతా కు కీలకం...**
రాజస్తాన్, కోల్ కతా జట్లు చివరి మ్యాచుల్లో విజయాలతో సమీకరణలు మారతాయి. రాజస్తాన్(ం0.0813) 4వ స్థానంలో ఉండగా.. కోల్ కతా(-0.038) 12మ్యాచ్ లు ముగిసేసరికి 11 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది. రాజస్తాన్ జట్టు 19న లక్నోపై భారీ లక్ష్యాన్ని ఛేదించి 23న పంజాబ్ తో మ్యాచ్ కోసం ఎదురు చూస్తోంది. ఈ మ్యాచ్ లో రాజస్తాన్ గెలిస్తే 16పాయింట్లతో 4వ స్థానానికి చేరి ప్లే-ఆఫ్స్ బెర్త్ కొడుతుంది.

ఒకవేళ పంజాబ్ గెలిస్తే 15పాయింట్ల తో ప్లే-ఆఫ్స్ రేసులో నిలుస్తుంది. రాజస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. మరోవైపు కోల్ కతా 20న ముంబయి, 24న ఢిల్లీపై గెలిస్తే.. పంజాబ్, కోల్ కతాలో 15పాయింట్లతో సమానంగా ఉంటాయి. దీంతో మెరుగైన రన్ రేట్ కలిగిన జట్టు నాకౌట్ చేరుతుంది. ఇప్పటికే 13 మ్యాచ్ లు ఆడేసిన ఢిల్లీ, చెడేసిన12 పాయింట్లతో ఉన్నా.. చివరి మ్యాచుల్లో గెలిస్తే సమీకరణలు, మెరుగైన రన్ రేట్ కీలకంగా మారనుంది. ఢిల్లీ జట్టు కోల్ కతాపై, చెన్నై జట్టు గుజరాత్ పై, పంజాబ్ జట్టు లక్నో పై చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఆ జట్లు చివరి మ్యాచ్ లో గెలిస్తే మెరుగైన రన్ రేట్ సాధించిన జట్టు ప్లే-ఆఫ్స్ కు చేరుతుంది.

పంజాబ్ జట్టు చివరి మ్యాచ్ లో ఇప్పటికే ఎలిమినేట్ అయిన లక్నోతో తలపడనుంది. ఆ మ్యాచ్ లో పంజాబ్ గెలిస్తే 15పాయింట్లతో టాప్-4లో నిలిచి ప్లే-ఆఫ్స్ కు చేరుతుంది. వీటితోపాటు కోల్ కతా, రాజస్తాన్ చివరి మ్యాచుల్లో ఓటమిపాలవ్వాలి.



# బంగ్లాదేశ్ క్లీన్ స్వీప్

### - రెండో టెస్ట్ లో పాకిస్తాన్ పై 78పరుగుల తేడాతో గెలుపు

సైహేట్(బంగ్లాదేశ్): పాకిస్తాన్ తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ను ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు 2-0తో చేజిక్కించుకొని క్లీన్ స్వీప్ చేసింది. దీంతో పాకిస్తాన్ పై తొలిసారి క్లీన్ స్వీప్ సాధించిన బంగ్లా జట్టుగా రికార్డుపుటల్లోకెక్కింది. 457పరుగుల భారీ ఛేదనలో భాగంగా పాకిస్తాన్ జట్టు రెండో ఇన్నింగ్స్లో 358 పరుగులకు కుప్పకూలింది. ఓవర్ నైట్ స్కోర్ 7వికెట్ల నష్టానికి 316 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ జట్టు మరో 42 పరుగులు జతచేసి చివరి మూడు వికెట్లను కోల్పోయింది. ఓవర్ నైట్ బ్యాటర్ రిజ్వాన్(94) తృటిలో సెంచరీ మిస్ చేసుకోగా.. సాజిద్ ఖాన్(28) బ్యాటింగ్ లో రాణించాడు. ఇక షహజాద్(0) నిరాశపరచడంతో ఐదో, చివరి రోజు పాకిస్తాన్ ఇన్నింగ్స్ తొలి సెషన్ లోనే ముగిసింది. బంగ్లాదేశ్ బౌలర్లు తైజుల్ ఇస్లామ్ ఆరు వికెట్లు పడగొట్టి పాకిస్తాన్ ఇన్నింగ్స్ను కుప్పకూల్చగా.. నహిద్ రాణాకు రెండు, షోరిఫుల్, మెహిదీ హసన్ లకు ఒక్కో వికెట్ దక్కాయి. తొలి టెస్ట్ లో 104 పరుగుల తేడాతో నెగ్గిన బంగ్లాదేశ్ రెండో టెస్టుఓ 78పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లింటన్ దాస్ కు, సిరీస్ ముష్ఫికర్ రహీమ్ కు దక్కాయి.

# గేల్ రికార్డును సూర్యవంశీ బ్రేక్ చేస్తాడు: కుంబ్లే

న్యూఢిల్లీ: యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మాజీ క్రికెటర్, వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ రికార్డును బ్రేక్ చేస్తాడని మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ప్రశంసలు కురిపించాడు. ఐపీఎల్‌లో ఓ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉంది. అయితే ఆ రికార్డును సూర్యవంశీ అధిగమిస్తాడని కుంబ్లే తెలిపాడు. మంగళవారం లక్నోతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఆరు సిక్సర్లు కొట్టాడు. దీంతో ఇప్పటి వరకు ఈ సీజన్‌లో సూర్యవంశీ 53 సిక్సర్లు బాదాడు. అయితే గతంలో క్రిస్ గేల్ ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 59 సిక్సర్లు బాదాడు. ఇక ఆ సిక్సర్ల రికార్డును బ్రేక్ చేసే అవకాశం సూర్యవంశీకి ఉన్నట్లు కుంబ్లే పేర్కొన్నారు.



# చిరంజీవి గొప్ప మనసు..
# ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్



ఎప్‌సెట్ స్టేట్ టాపర్ రుషిని సత్కరించిన మెగాస్టార్
ఫస్ట్ ర్యాంక్ వస్తే చిరంజీవిని కల్పిస్తానని తండ్రి ప్రామిస్
1986 తర్వాత ఇంజినీరింగ్‌లో టాపర్‌గా నిలిచిన తొలి అమ్మాయి
రుషి సాధించిన ఘనతకు చిరంజీవి ప్రశంసలు
ఐఏఎస్ కలకు మద్దతు ఇస్తానని హామీ

"నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది.


**తండ్రి మాట కోసం**
తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది.

**40 ఏళ్ల రికార్డు బద్దలు**
రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**మెగాస్టార్ ఘన సత్కారం**
తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు.

**ఐఏఎస్ సంకల్పానికి మద్దతు**
ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.

# జూనియర్ ఎన్టీఆర్ 'సీఎం' అంటూ..
# అభిమానుల నినాదాలు



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'డ్రాగన్'
పలు థియేటర్లలో ఈ సినిమా గ్లింప్స్ విడుదల కోసం స్పెషల్ స్క్రీనింగ్స్ ఏర్పాటు
బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద అభిమానుల కోలాహలం

టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'డ్రాగన్' ఫస్ట్ గ్లింప్స్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఐదు భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ గ్లింప్స్ కోసం హైదరాబాద్ వ్యాప్తంగా పలు థియేటర్లలో స్పెషల్ స్క్రీనింగ్స్ ఏర్పాటు చేయగా, బాలానగర్‌లోని విమల్ థియేటర్ వద్ద అభిమానుల కోలాహలం మిన్నంటింది. భారీ కటౌట్లు, పాలాభిషేకాలు, బాణసంచా కాల్పులతో థియేటర్ ప్రాంగణమంతా ఒక మాస్ జాతరను తలపించింది.

తమ అభిమాన హీరో స్క్రీన్ మీద కనిపించగానే ఫ్యాన్స్ చేసిన హంగామాతో థియేటర్లు దద్దరిల్లాయి. అయితే ఈ వేడుకల్లో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడంతో పాటు, అభిమానులు పెద్ద పెట్టున చేసిన "సీఎం.. సీఎం.." నినాదాలు ఇప్పుడు అటు సినిమా ఇండస్ట్రీలోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న తారక్, ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ కేవలం సినిమాలపైనే పూర్తి దృష్టి పెట్టారు. అయినప్పటికీ, ఆయన రాజకీయాల్లోకి రావాలనే డిమాండ్ అభిమానుల్లో ఎప్పటికప్పుడు వ్యక్తమవుతూనే ఉంది.

ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో ఆ స్థాయి మాస్ ఫాలోయింగ్, క్రేజ్ ఉన్న ఏకైక హీరో ఎన్టీఆర్ మాత్రమేననే చర్చ సోషల్ మీడియాలో జోరందుకుంది. దానికి తగ్గట్టుగానే ఇప్పుడు థియేటర్ల వద్ద ఫ్యాన్స్ చేసిన 'సీఎం' నినాదాలు తారక్ రాజకీయ భవిష్యత్తుపై మళ్లీ ఆసక్తికరమైన చర్చకు తెరలేపాయి.

# సింధుజకు శ్రమశక్తి అవార్డు



**తిరుపతి -ఆంధ్రనాడు,మే 20:** కార్మిక శాఖ తరపున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఇస్తున్నటువంటి "శ్రమశక్తి" అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు అంగరంగ వైభవంగా జరిగినది. కార్యక్రమంలో భాగంగా కార్మికుల సమస్యల కొరకు గత 26 సంవత్సరాలుగా అహర్నిశలు కృషిచేస్తున్నటువంటి తిరుపతికి చెందిన టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జోన్ 4 ఇంచార్జ్, డా"అంబూరు సింధూజకు ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ చేతులమీదుగా అవార్డును ప్రధానం చేయడం జరిగినది. కార్యక్రమంలో కార్మికశాఖ కార్యదర్శి ఎం.వి.శేషగిరి బాబు (ఐఏఎస్), కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు (ఐఏఎస్), కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీషా,కార్మిక శాఖ చైర్మన్లు గొట్టుముక్కల రఘురామరాజు, వి.మల్లికార్జునరావు, గండిబాబ్జి, కార్మికశాఖ అధికారులు, యాజమాన్యాలు, కార్మిక నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గంటావూరు జాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**పలమనేరు-ఆంధ్రనాడు, మే 20 :** పలమనేర్ మున్సిపల్ పరిధిలోని గంటావూరులో ఈ నెల 25 నుంచి 27 వరకు జరగనున్న గంగమ్మ జాతరకు విచ్చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ మురుగన్ బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంట ఊరు తిరుపతి గంగమ్మ దేవస్థాన కమిటీ ఎమ్మెల్యేను స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలసి సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 25న అమ్మవారి శిరస్సు మెరవణి, 26 న అమ్మవారి విశ్వరూప దర్శనం, 27న జలధి కార్యక్రమాలు ఉంటాయని జాతరకు తప్పక విచ్చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలమనేరు తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ శ్రీధర్ తో పాటు జనసేన నాయకులు జిల్లేడు అరుణ్ కుమార్ తదితరులున్నారు.

## బాలాజీ నాయుడును కలసిన టి.వి.కె. శాసన సభ్యులు

**పలమనేరు-ఆంధ్రనాడు,మే 20:** తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లా కె.వి.కుప్పం శాసన సభ్యులు తెంద్రాల్ కుమార్ పలమనేరు రూరల్ మండలంలోని మండీ పేట కోటూరు గ్రామానికి చెందిన తన మిత్రులు బాలాజీ నాయుడు స్వగృహానికి విచ్చేసి బుధవారం కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో తెంద్రాల్ కుమార్ టి.వి.కె. పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు.దీంతో బాలాజీ నాయుడును షాలువాతో ఎం ఎల్ ఏ సత్కరించారు.ఇలా ఒకరికొకరు మర్యాద పూర్వకంగా సత్కరించుకొని ఆత్మీయశీగా కలుసుకోవడంతో గ్రామస్థులు ఆందించారు.






Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733